# బాప్తిస్మము ఎందుకు ప్రాముఖ్యమైనది

## రక్షింపబడుటకు మనమేమి చేయవలెను?

"బాప్తిస్మముగూర్చి ఎందుకు అంతగా పట్టించుకొనుచున్నావు? అది ఒక ఆచారము మాత్రమే కదా? శిశువు తలపై నీళ్లు చిలకరించుట లేదా పూర్తిగా నీళ్లలో మునుగుటనా? వీటికి మధ్యనున్న బేధమేమిటి? మీ సమయమంతా వృధాచేస్తున్నారు" అని ఈ విధంగా ఎంతో మంది చెప్పుదురు.

పై ప్రశ్నలన్నిటికి క్లుప్తంగా సమాధానము ఇవ్వవలెననినా, క్రొత్త నిబంధనలో బాప్తిస్మముగూర్చి ఎంతో వివరంగా తెలియజేయబడినది; యేసు ప్రభువు తానే స్వయంగా బాప్తిస్మముగూర్చి తెలియజేసెను మరియు అపొస్తలులును తెలియజేసిరి. అయితే వాస్తవమేమనగా బైబులు మాత్రమే మనకు కలదు. యేసు ప్రభువు ఎవరు, ఆయన ఏమి బోధించెను మరియు అతని వెంబడించువారు ఏమి చేయవలెనని ఆజ్ఞాపించెనో ఆ సమాధానములకొరకు బైబుల్లో చూడవలెను; వేరేచోట్ల వెదకినయెడల మనుష్యుల అభిప్రాయములకు, సలహాలకు ప్రాముఖ్యతను ఇచ్చినవారమగుదుము. బాప్తిస్మముగూర్చి బైబుల్లో ఏమి తెలియజేయబడెనో అది మనకు ఎంతో ప్రాముఖ్యము. క్రీస్తు మరియు అతడు ఏర్పరచుకున్న అపొస్తలులు బాప్తిస్మముగూర్చి కొన్ని విషయములు తెలియజేసిరి; ఆ విషయములు ఏమిటో మనము తప్పక తెలుసుకొనవలెను. ప్రాముఖ్యమైన ప్రశ్న ఏమనగా: యేసు ప్రభువు ఏమి ఆజ్ఞాపించెను మరియు బోధించెను? క్రీస్తు ఆజ్ఞలప్రకారము అతని అపొస్తలులు ఏమిచేసిరి?

## "నీటి మూలముగా జన్మించుట"

రాత్రివేళ నికొదేము యేసునొద్దకు వచ్చినప్పుడు నికొదేముతో ఈ విధంగా అనెను: "ఒకడు క్రొత్తగా జన్మించితేనేకాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను". నికొదేము ఈ మాటలను శబ్దార్థప్రకారము గ్రహించినప్పుడు, యేసు ప్రభువు మరికొంత వివరముగా తెలియజేసెను; "ఒకడు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించితేనే కాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (యోహాను 3:3,5). అయితే క్రీస్తు "నీటిమూలముగా జన్మించితేనే గాని......" అని ప్రత్యేకంగా ఎందుకు తెలియజేసెను? ఈ విషయము బాప్తిస్మమును సూచించుటలేదా? బాప్తిస్మమిచ్చు యోహాను పశ్చాత్తాపముగూర్చి ప్రకటించి ఎంతో మందికి యొర్దాను నదిలో బాప్తిస్మమిచ్చెను. యేసు ప్రభువుకూడ యోహానుచే బాప్తిస్మము పొంది ఈ విధంగా చెప్పెను: "ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను" (మత్తయి 3:15). "ఒకడు నీటిమూలముగా జన్మించితేనేగాని..." అని యేసు చెప్పినప్పుడు, దేవుని రాజ్యమునకు ప్రవేశించుటకు ఒక పురుషుడు లేదా స్త్రీ, తప్పక బాప్తిస్మము పొందవలెనని చెప్పెను.

యేసు ప్రభువు పరలోకమునకు ఆరోహణము కాకమునుపు తన శిష్యులకు ఈ విధంగా ఆజ్ఞాపించెను: "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోకి వారికి

బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" (మత్తయి 28:19-20).

యేసు ప్రభువు ఆరోహణమైన పిమ్మట తన శిష్యులకు ఆయన ఒక పనిని అప్పగించెను అది ఏమనగా: బాప్తిస్మము అను కార్యము కూడా ఎంతో ప్రాముఖ్యమని తెలియజేసెను.

## అపొస్తలులు ఏమి చేసిరి?

యేసు ప్రభువు చెప్పిన ఉపదేశములను అపొస్తలులు ఏ విధంగా పాటించిరి? అపొస్తలుల కార్యములలో శిష్యులు చేసిన కార్యములన్నియు ఎంతో వివరంగా తెలియజేయబడెను: అపొ.కా. 2:36-38 - "మీరు సిలువవేసిన యీ యేసునే, దేవుడు ప్రభువుగాను క్రీస్తుగాను నియమించెను...." అని పేతురు చెప్పెను.

"వారు ఈ మాటవిని హృదయములో నొచ్చుకొని - సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును అడిగిరి. పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" అని తెలియజేసెను.

అపొ.కా. 8:12 - ఫిలిప్పు సమరయలో సువార్త ప్రకటించెను: "అయితే ఫిలిప్పు దేవునిరాజ్యమును గూర్చియు యేసు క్రీస్తునామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతని నమ్మి, పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి"

అపొ.కా. 8:39 - యేసు ప్రభువు లేఖనములను ఏవిధంగా నెరవేర్చెనో ఫిలిప్పు తెలియజేసినప్పుడు ఐతియొపీయుడైన నపుంసకుడు ఈ విధంగా అడిగెను:

"వారు త్రోవలో వెళ్లుచుండగా నీళ్లున్న యొక చోటికి వచ్చినప్పుడు నపుంసకుడు - ఇదిగో నీళ్లు; నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని అడిగి రథము నిలుపమని ఆజ్ఞాపించెను. ఫిలిప్పును నపుంసకుడు ఇద్దరును నీళ్లలోకి దిగిరి. అంతట ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చెను".

ఫిలిప్పు, ఐతియొపీయుడైన నపుంసకునికి బాప్తిస్మము యొక్క భావము మరియు ప్రాముఖ్యతనుగూర్చి చెప్పియుండవచ్చును; ఇందునిమిత్తమే బాప్తిస్మము తీసుకొనుటకు ఆటంకమేమని ఫిలిప్పును నపుంసకుడు అడిగెను.

అపొ.కా. 9:18 - తర్షీషుకు చెందిన సౌలు, దమస్కు వెళ్లుదారిలో మృతులలోనుండి తిరిగి లేచిన యేసు ప్రభువును చూచినప్పుడు తన దృష్టిని కోలిపోయెను. అటుపిమ్మట విశ్వాసియైన అననీయద్వారా తిరిగి తన దృష్టిని పొందెను. పౌలు అననీయ మాటలు వినగానే: "అప్పుడే అతని కన్నులనుండి పొరలవంటివి రాలగా దృష్టి కలిగి, లేచి బాప్తిస్మము పొందెను".

అపొ.కా. 16:14-15 - లుదియ యను దైవభక్తిగల స్త్రీ పౌలు బోధనలయందు లక్ష్యముంచి బాప్తిస్మము పొందెను.

అపొ.కా. 16:30-33 - ఫిలిప్పు పట్టణమునకు చెందిన చెరసాల నాయకుడు పౌలు బోధనలను విని రక్షణ పొందుటకు నేనేమి చేయువలెననెను. పౌలు, సీలలు - "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీయింటివారును రక్షణ పొందుదురని" చెప్పెను. అప్పుడు చెరసాల నాయకుడు మరియు అతని ఇంటి వారందరును బాప్తిస్మము పొందిరి.

అపొ.కా. 19:3-5 - ఎఫెసులోని కొందరు విశ్వాసులు యోహాను బాప్తిస్మము మాత్రమే ఎరిగియుండిరని పౌలు తెలుసుకొనెను; అప్పుడు పౌలు వారికి ఈ విధంగా వివరించెను: "అందుకు పౌలు, యోహాను తన వెనుక వచ్చువానియందు, అనగా యేసునందు విశ్వాసముంచవలెనని ప్రజలతో చెప్పుచు, మారుమనస్సు విషయమైన బాప్తిస్మమిచ్చెనని" చెప్పెను. వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి.

## కొర్నేలి

అపొస్తలుల కార్యములు 10వ అధ్యాయములోని కొర్నేలి సంఘటన చివరిగా చర్చించుటకు ఎన్నుకొనబడినది. ఎందుకనగా ఆధునిక కాలమునకు తగినట్లుగా ఆ సంఘటనలో ఎన్నో ఆసక్తికరమైన విషయములు తెలియజేయబడినవి. కొర్నేలి అను నతడు ఇశ్రాయేలు దేవుని గూర్చి తెలుసుకొని ఆయనను ఆరాధించుటకు ఆసక్తిని కనపరచిన ఒక రోమా శతాధిపతి. అతని గూర్చి ఈ విధంగా తెలియజేయబడినది: "అతడు తన యింటివారందరితో కూడ దేవునియందు భయభక్తులు గలవాడై యుండి, ప్రజలకు బహు ధర్మముచేయుచు ఎల్లప్పుడును దేవునికి ప్రార్థనచేయువాడు" (అపొ.కా. 10:2). కొర్నేలిగూర్చి ఎంత అద్భుతంగా తెలియజేయబడినదో గమనించండి - దేవుని ఆరాధించువాడు, నీతికార్యములు చేయువాడు మరియు నిత్యము దేవునికి ప్రార్థించువాడు - ఇవన్నియు చేసిన ఇతనికి మరి ఏమియు చేయుటకు అవసరము లేదని మనము అనుకొనవచ్చును. అయితే లేఖనములను

పరిశీలించి చూసినట్లయితే, అతడు ప్రాముఖ్యమైన ఒక కార్యమును చేయవలెనని గమనించెదము. ఇందునిమిత్తము అతడు చేయవలసినది కొర్నేలికి తెలియజేయుటకు అపొస్తలుడైన పేతురు పంపబడెను: "ఏ మాటలవలన రక్షణ పొందుదురో ఆ మాటలు అతడు నీతో చెప్పును". క్రీస్తు ద్వారా దేవుడు తన కార్యములను బయలుపరచెనని పేతురు కొర్నేలికి వివరించెను: "ఆయనయందు విశ్వాసముంచువాడెవడో వారు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందుదురు" (అపొ.కా. 10:43).

పేతురు కొర్నేలిని దర్శించుటకు సంశయించెను. ఆ కాలములో యూదులు అన్యజనులను ద్వేషించిరి మరియు సంఘములోనికి ఆహ్వానించలేదు. ఒక దర్శనముద్వారా దేవుడు ఈ విషయమును పేతురునకు వివరించెను. దేవుడు పవిత్రము చేసినవి నీవు నిషిద్ధమైనవిగా ఎంచవద్దని ఆ దర్శనము ద్వారా పేతురునకు ఒక పాఠమును నేర్పెను. పేతురు బోధనలను కొర్నేలి అంగీకరించినప్పుడు, పరిశుద్ధాత్మ వరము అన్యజనులమీద కుమ్మరింపబడెను. (అపొ.కా. 10:44). అన్యజనులమీద పరిశుద్ధాత్మను కుమ్మరించుటద్వారా దేవుడు వారినికూడా ఎన్నుకొనెనని రుజువు చేయబడెను. అప్పుడు అక్కడనున్న జనులు విభ్రాంతినొందిరి. పరిశుద్ధాత్మ ఒక ప్రత్యేకమైన వరము. పరిశుద్ధాత్మ వరమును అన్యజనులకు అనుగ్రహించుటద్వారా అన్యజనులను కూడ విశ్వాసులుగా స్వీకరించితినని దేవుడు యూదులకు తెలియజేసెను.

అప్పుడు పేతురు అన్యజనులను ఈ విధంగా ఉపదేశించెను: "అందుకు పేతురు – మనవలె పరిశుద్ధాత్మను పొందిన వారు

బాప్తిస్మము పొందకుండ ఎవడైనను నీళ్లకు ఆటంకముచేయగలడా? అని చెప్పి, యేసు క్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అపొ.కా. 10:47-48).

ఈ సంఘటనలో ఒక ప్రాముఖ్యమైన విషయమును గమనించవలెను. కొర్నేలి మరియు అతని కుటుంబము వారు పరిశుద్ధాత్మ వరమును పొందియుండినను, వారు బాప్తిస్మము పొందవలెనని పేతురు ఆజ్ఞాపించెను. ఇందునుబట్టి, బాప్తిస్మము ఎంతో అవసరమని తెలియజేయుటకు కొర్నేలి సంఘటనకు మించిన గొప్ప ఉదాహరణ లేదా రుజువు కలదా?

## మనము ఏవిధంగా రక్షింపబడుదుము?

ఒక సమస్యను ఎదురుకొనినప్పుడు దాన్ని పరిష్కరించుటకు అసాధ్యమని మొదట తోచును. అయితే మనము ఎదురుకొను గొప్ప సమస్య లేదా ఆటంకము ఏమనగా స్త్రీ, పురుషులందరును దేవుడు ఉద్దేశించిన ప్రకారము నడుచుకొనుటకు విఫలులగుట; ఇదే బైబుల్లో పాపము అని పిలువబడెను. పాపము అను పదమును తప్పించుకొనుటకు ప్రయత్నించకూడదు. మానవుల బలహీనతలను మరియు అవిధేయతనుగూర్చి తెలియజేయుటకు దేవుడును పాపము అను పదమును ఉపయోగించెను. పాతనిబంధనలో ఇశ్రాయేలీయుల అపరాధములగూర్చి తెలియజేసినప్పుడు, దేవుని ప్రవక్తలు, పాపము అను పదమును ఉపయోగించిరి. క్రొత్త నిబంధనలో యేసు ప్రభువు మరియు అతని అపొస్తలులును ఈ పదమును ఉపయోగించిరి. దేవుడు మనకు ఇచ్చిన

సందేశములో, మానవులు పాపమునకు లొంగిపోయిన వారను సత్యము స్పష్టముగా కనబడుచున్నది, గనుక ఈ విషయమును మనము తృణీకరించకూడదు. మానవుల పాపములగూర్చి దేవుడు పట్టించుకొనునని మనము నిస్సందేహముగా చెప్పవచ్చును.

అయితే దేవుని వాక్యమునకు విధేయత కలిగి రక్షణపొందువారందరికిని, పాపమను ఈ గొప్ప ఆటంకమును తప్పించుకొనుటకు దేవుడు ఒక గొప్ప అవకాశమును కల్పించెను. అయితే మానవులందరికి ఈ గొప్ప అవకాశమును కలుగజేయుటకు దేవుడు పరిశుద్ధాత్మ శక్తిద్వారా తన కుమారుడైన యేసును నజరేతులోని యూదురాలైన మరియ అను ఒక కన్యకకు జన్మింపజేసెను. ఈ విషయము లూకా సువార్తలో ఎంతో వివరంగా తెలియజేయబడెను – "పరిశుద్ధాత్మ నీమీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" (లూకా 1:35).

కాని దేవుడు తన కుమారుడు జన్మించుటకు మానవురాలైన ఒక స్త్రీని ఎందుకు ఎన్నుకొనెనో ఆ ముఖ్య ఉద్దేశముగూర్చి దూతలు యోసేపునకు వివరించిరి: "తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువనెను" (మత్తయి 1:21).

## యేసు మరణము

యేసు మరణము ఏ విధంగా "పాపమునుండి రక్షించును?" ఈ ప్రశ్నకు సమాధానమును క్రీస్తు యొక్క

అద్భుతమైన జీవితముద్వారను మరియు చివరిగా అతని మరణముద్వారా తెలుసుకొనగలము. యేసు జీవితముగూర్చి ఆలోచించండి. క్రొత్త నిబంధనలో తెలియజేయబడిన ప్రకారము, క్రీస్తు మన స్వభావమునే కలిగియుండెను. అతడు తన తల్లియైన మరియ స్వభావమును కలిగియుండెను. హెబ్రీయుల పత్రికలో క్రీస్తు మన మాదిరిగానే యుండెనని తెలియజేయబడెను. "క్రీస్తు మనవలె రక్తమాంసములుగలవాడై యుండెను" (హెబ్రీ 2:14). అయితే దీని భావమేమనగా అతడు ప్రతి విషయమును మన మాదిరిగానే అనుభవించెను; ఇదే విషయమునుగూర్చి హెబ్రీయుల పత్రికలో తెలియజేయబడెను;

"తాను (క్రీస్తు) శోధింపబడి శ్రమ పొందెను గనుక శోధింపబడు వారికిని సహాయము చేయగలవాడైయున్నాడు"

"మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను ఆయన పాపము లేనివాడుగా ఉండెను" (హెబ్రీ. 2:18; 4:15).

ప్రతి కోరికను యేసు ప్రభువు కూడా అనుభవించెను. యేసు, తన భౌతిక అవసరములను తీర్చుకొనుటకు, ఈ లోకపరమైన అధికారము కలిగియుండుటకు మరియు తన్ను తాను సంతోషపరచుకొనుటకు శోధింపబడెను, కాని ఈ లోకస్థులైన స్త్రీ, పురుషులమాదిరిగా తన సహజ స్వభావమునకు లేదా కోరికలకు లొంగిపోలేదు. ఆ కోరికలన్నిటిని తృణీకరించి దేవుని యెడల విధేయత కలిగియుండెను.

ఈ విషయము మనకు ఎంతో సూచనాత్మకమైనది. చరిత్రలో మొదటిసారి ఒక మానవుడు పాపమును జయించెను. మానవ స్వభావమును పరిపాలించు పాపము సంపూర్ణంగా జయింపబడెను. స్త్రీ, పురుషులు తమ స్వంతగా సాధించలేకపోయిరి కాని క్రీస్తు సాధించగలిగెను.

పాపము లేనివాడుగా మరియు మానవజాతికి చెందినవాడై క్రీస్తు తనను తాను లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లగా సమర్పించుకొనెను (యోహాను 1:29). అనగా పాపమునకు స్వేచ్ఛార్పణగా తన్నుతాను సిలువ మీద బలిగా అర్పించుకొనెను.

మానవాళికి ప్రతినిధిగా క్రీస్తు, నీతిపరమైన దేవుని తీర్పును హెచ్చించి, పాపమును ఖండించి జయించెను. క్రీస్తు పాపమును స్వభావమును సంపూర్ణంగా నిర్మూలించెను. "శరీరము ననుసరింపక ఆత్మ ననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతి విధి నెరవేర్చబడవలెనని పాప పరిహారము నిమిత్తము ఁవుడు తన స్వకీయ కుమారుని పాప శరీరాకారములో పంపి, ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను" (రోమా 8:3).

యేసు ప్రభువు యే పాపమును చేయలేదు గనుక, దేవుడు ఎంతో అద్భుత రీతిగా అతని మృతులలోనుండి లేపి నిత్యజీవమును మరియు శక్తిని అనుగ్రహించెను.

అయితే ఇది అంతయు మనకు ఏవిధముగా సహాయపడును? మనము పాపస్వభావముగలవారము గనుక మనము జీవించునంత కాలము సంపూర్ణ పరిపూర్ణతను కలిగియుండము.

## దేవుని షరతులు

ఒక అద్భుతమైన క్రియ ద్వారా జవాబు నివ్వలేము. ఆయన కుమారుని విశ్వసించినంత మాత్రాన దేవుడు మనలను తనంతటతానే వెంటనే మార్చి వేయడు. తన కుమారుని ఆత్మ త్యాగముద్వారా మనలను నిర్దోషులుగా దేవుడు పరిగణించడు. అయితే దేవుడు కొన్ని షరతులనుబట్టి తన కృపాకనికరములతో పాప క్షమాపణను మనకు అనుగ్రహించును. ప్రధానమైన షరతు ఏమనగా క్రీస్తుద్వారా దేవుని యెుద్దకు వచ్చు ప్రతి స్త్రీ, పురుషుడును తవు గూర్చి తెలుసుకొనవలెను మరియు క్రీస్తు యొక్క సిలువ మరణమును పాపమునకు ప్రతిష్టార్పణముగా పరిగణించవలెను. వారు తమ సంతోషము నిమిత్తము మరియు తమ శరీరానుసారముగా కాక యేసు ప్రభువు స్వభావమునుగలవారై కృపా సత్యములలో జీవించవలెను.

అప్పుడు దేవుడు "మన రుణములను కొట్టివేసి" ఆయనతో సరియైన సంబంధము కలిగియుండుటకు మనలను స్వీకరించును. అప్పుడే దేవుడు మనలను ఆయన "కుమారులుగా మరియు కుమార్తెలుగా" అంగీకరించును. అప్పుడు దేవుని కుటుంబమునకు చెందినవారమై యుందుము. ఆ కుటుంబమునకు శిరస్సు దేవుని ఏకైక కుమారునిగా పుట్టినవాడైన క్రీస్తు.

## పశ్చాత్తాపము మరియు పరివర్తనము

బైబుల్లోని రెండు ముఖ్యమైన పద భావములగూర్చి మనము ఇప్పుడు తెలుసుకొనవలెను. యేసు ప్రభువు ఆరోహణము అయిన తరువాత, యెరూషలేములోనున్న వారితో అపొస్తలుడైన పేతురు ఈ విధంగా చెప్పెను.

"మీ పాపములు తుడిచివేయబడు నిమిత్తమును మారుమనస్సు నొంది తిరుగుడి..." (అపొ.కా. 3:19).

ఆధునిక కాలములో 'పశ్చాత్తాపము' మరియు 'పరివర్తనము' అను పదముల భావము పూర్తిగా మార్చివేయబడినది. ఇది ఎంతో దురదృష్టకరమైన విషయము. నిజమైన పశ్చాత్తాపము అనగా "మనస్సు మార్చుకొని సంపూర్ణంగా గ్రహించుట". అయితే మనస్సు మార్చుకొనుట అనగా నేమి? దీనికి జవాబు మనము ముందుగా చెప్పుకున్న వాటిలో స్పష్టముగా తెలియజేయబడినది. మనస్సు మార్చుకొనుట అనగా మనలో సంపూర్ణ పరివర్తనము వచ్చుట. బైబుల్లో దేవుడు తెలియజేసిన పరిమాణముల ప్రకారము జీవించుటకు విఫలులమైతిమని గ్రహించుట మరియు పాపులమని గుర్తించుట.

అప్పుడు ఈ ఆజ్ఞ తెలియజేయడెను. - "మారుమనస్సు పొందుడి". దీని భావమేమనగా "వెనుతిరిగి ఎదురుగా నున్న దిశలో వెళ్లుట". ఇదే నిజమైన పశ్చాత్తాపము యొక్క క్రియాపూర్వకమైన ప్రతిఫలము. దేవుని చిత్తప్రకారము మరియు క్రీస్తు ఆజ్ఞలను అనుసరించినడుచుకొనుటకు మన జీవితములను సరియైన దిశలో త్రిప్పుకొనుటకు అవసరతయున్నదని మనము గుర్తించవలెను. అప్పుడే పశ్చాత్తాపమునొంది సంపూర్ణ పరివర్తనము చెందినవారమగుదుము.

యెరూషలేములోనున్న వారికి సందేశమునిచ్చినప్పుడు అపొస్తలుడైన పేతురు మరియొక విషయమును తెలియజేసెను: "మీరు మారు మనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు

క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపొ.కా. 2:38).

యేసు ప్రభువు మరియు అపొస్తలుల కాలములోను నీటిలో పూర్తిగా మునిగి బాప్తిస్మము పొందుట ఎంతో ప్రాముఖ్యముగా ఎంచబడెను. ఇందునిమిత్తమే పేతురు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను. బాప్తిస్మమనగా ఏమిటో అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో వివరించెను. "క్రీస్తు యేసులోకి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోకి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో అలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:3-4).

మరియు పౌలు కొలస్సీయులకు ఈ విధంగా వ్రాసెను: "మీరును బాప్తిస్మమందు ఆయనతోకూడ పాతిపెట్టబడినవారు...." (కొలస్సీ 2:12).

కాని కేవలము మృతులైన వారు మాత్రమే పాతిపెట్టబడుదురు కాని బ్రతికియున్నవారు కాదు గదా? అవును అదేవిషయమును పౌలు కొలస్సీయులతో వివరించెను. కొలస్సీయులు సువార్త పిలుపు వినకమునుపు వారి శరీరస్వభావమునకు లొంగిపోయిరని తెలియజేసెను. "మరియు మీరు అపరాధములవలనను, శరీరమందు సున్నతిపొందక యుండుటవలనను, మీరు మృతులైయుండిరి" (కొలస్సీ 2:13).

## పాతిపెట్టబడి లేపబడుట

పౌలు తన సందేశమును ఎంతో స్పష్టముగా తెలియజేసెను. పాప స్వభావమునకు లొంగిపోయినవారు దేవుని దృష్టిలో మృతులైయుందురు. వారికి నిరీక్షణలేక మరణము మాత్రము మిగిలియుండెను; వారిగూర్చి తెలుసుకొనుటకు అవసరత నుండెను; మరియు పాపమునకు దేవుడు వేసిన శిక్ష మరణమని గ్రహించి బాప్తిస్మమను నీటిలో పూర్తిగా మునిగి మృతిపొందవలెను. మరియు జీవితములో ఒక క్రొత్త సంకల్పముతో బాప్తిస్మమను నీటిలోనుండి తిరిగి లేపబడుదురు.

"కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో (పాలుపొందుటకై) ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి" (రోమా 6:4). మరియు కొలస్సీయులతో పౌలు ఈ విధంగా చెప్పెను: "మీరును బాప్తిస్మమందు ఆయనతోకూడ పాతిపెట్టబడినవారై ఆయనతోకూడ లేపబడితిరి" (కొలస్సీ 2:12).

బాప్తిస్మమునకు మరియు క్రీస్తు మరణపునరుత్థానములకు సమాంతరము ఎంతో స్పష్టముగానున్నది.

యేసు క్రీస్తు, అమరత్వముతో కూడిన నూతన జీవితమునకు మృతులలోనుండి లేపబడిన ప్రకారమే విశ్వాసులును బాప్తిస్మమను నీటినుండి నూతన జీవితమునకు లేపబడుదురు. అయితే బాప్తిస్మముపొందిన విశ్వాసి ముందటి మాదిరిగానే అదే భౌతిక స్వభావమును కలిగియుండును; కాని అతడు మనస్సునందు

పరివర్తనము చెందును. తన శరీరాశలకు లొంగిపోయి జీవించినట్లయితే నిత్యమరణమును మాత్రమే పొందుదునని అతడు గ్రహించును గనుక దేవుని చిత్తమును అంగీకరించి క్రీస్తు ఆజ్ఞల ప్రకారము జీవించుటకు ఆ విశ్వాసి ఒక క్రొత్త లక్ష్యమును కలిగియుండును.

క్రొత్తగా జన్మింపవలెనని యేసు ప్రభువు నికొదేముతో చెప్పినప్పుడు పైన వివరించిన భావములనే తెలియజేసెను. అపొస్తలుడైన పౌలు మరికొంత వివరముగా తెలియజేసెను.

"కాబట్టి శరీర దురాశలకు లోబడునట్లుగా చావుకులోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి.... మీరు కృపకే గాని ధర్మశాస్త్రమునకు లోనైనవారు కారు గనుక పాపము మీ మీద ప్రభుత్వము చేయదు" (రోమా 6:12,14).

అనగా మన శరీర దురాశలు మనలను ఏలుటకు అవకాశమివ్వకూడదు మరియు చెడుతనమునకు బానిసలుగా నుండకూడదు. పౌలు ఈ విధంగా తెలియజేసెను: "అయితే మృతులలోనుండి జీవితులమనుకొని మిమ్మును మీరే దేవునికి అప్పగించుకొనుడి" (రోమా 6:13).

అయితే ఒక నమ్మకమైన విశ్వాసి తన యజమానులను మార్చుకొనును, ఎందుకనగా అతడు తన మనస్సు మార్చుకొని, అనగా బైబులు ప్రకారము, పశ్చాత్తాపము పొందెను. అతడు ఒక క్రొత్త లక్ష్యమును కలిగియున్నాడు గనుక అతడు క్రొత్త జీవితమును పొందియున్నాడు. ఈ విధంగా అతడు క్రొత్తగా జన్మించియున్నాడు. ఈ పరివర్తనమునే అపొస్తలుడైన పౌలు, ఒక నూతన పురుషునిగా

మారుట అని వివరించెను: "కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే... వదులుకొని... నూతన పరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావమును ధరించుకొనవలెను" (ఎఫెసీ 4:22-24).

"జీవించువారిక మీదట తమకొరకు కాక తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతిపొందెననియు నిశ్చయించుకొనుచున్నాము... కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి..." (2కొరింథీ 5:15,17).

## క్రొత్త జీవితము

బైబుల్లో చెప్పిన ప్రకారము బాప్తిస్మము ఎంతో ప్రాముఖ్యమైనది. దీని ద్వారా ఒక విశ్వాసి తాను మరణమునుండి రక్షింపబడవలసిన అవసరము యున్నదని గ్రహించి క్రీస్తును అనుసరించి జీవించుటకు నిర్ణయించుకొనును. దేవుడు తన బిడ్డగా స్వీకరించునని విశ్వాసముతో ఒక క్రొత్త జీవిత విధానమును అవలంబించి నడుచుకొనును. ఇదంతయు కొన్ని నెలలవయస్సుగల పసిబిడ్డ చేయలేదు. ఆ పసిబిడ్డ జ్ఞానవివేకములు కలిగియుండదు. మరియు ఆ బిడ్డకు బాధ్యతగా ఎవరును నిలబడలేరు. ఈ విధంగా జరగదని లేఖనములలో తెలియజేయబడెను.

"మన స్వరక్షణను కొనసాగించుకొనవలెను" (ఫిలిప్పీ 2:21). ఎవ్వరైనను మనకు రక్షణను కలుగజేయలేరు.

ఇందునిమిత్తమే చిన్న పిల్లలు మరియు పసి బిడ్డలు

బాప్తిస్మము పొందిన ఉదాహరణలగూర్చి క్రొత్త నిబంధనలో తెలియజేయబడలేదు; క్రొత్త నిబంధనలో బాప్తిస్మము పొందినవారందరును పూర్తి జ్ఞాన వివేకములు మరియు గ్రహింపు శక్తికలిగిన పెద్దవారు. క్రీ.శ. 150 శతాబ్దములోనున్న చర్చిలలోను పసిబిడ్డలు బాప్తిస్మము పొందినట్లుగా లిఖింపబడలేదు.

జస్టిన్ మార్టిన్ క్రీ.శ. 165లో మరణించెను. ఇతడు రచించిన రచనలును పెద్దవారిని ఉద్దేశించి వ్రాయబడినవి: “మేము హెచ్చరించిన వారందరును మా బోధనలు నిజమైనవని నమ్మి వాటిని అనుసరించి నడుచుకొనువారు. మరియు పాపక్షమాపణ కొరకు ప్రార్థించుటకు ఉపదేశింపబడిరి. బాప్తిస్మము పొందుటకు స్వేచ్ఛగలవారమై, బాప్తిస్మమును నీటిద్వారా పాపక్షమాపణ పొందగలము... ఒక విశ్వాసి పశ్చాత్తాపమునొంది తాను తిరిగి జన్మించుటకు తానే ఎన్నుకొనును”. (ఆంటె - నైసీన్ క్రైస్తవ గ్రంథాలయము భా, పు. 59).

దాదాపు క్రీ.శ. 200లో టర్టిల్లియన్ అనునతడు, పసిబిడ్డలు లేదా శిశువుల బాప్తిస్మముగూర్చి విమర్శించినవారిలో మొదటివాడు. అతడు అపొస్తలుల ఆచారములను పాటించినవాడని పేరు పొందెను. అతడు శిశువుల బాప్తిస్మము అను దురాచారమును ఖండించెను. అతడు ఎంతో ఉత్సాహముతో ఈ ఆచారమును ఖండించెనని నియండర్ అను చరిత్రకారుడు తెలియజేసెను. (చర్చి చరిత్ర, భా.1, పు. 425).

## శిశువుల బాప్తిస్మము లేఖనములకు వ్యతిరేకము

దాదాపు కొన్ని శతాబ్దములనుండి మరి ముఖ్యంగా 16వ శతాబ్దములో బైబులు బోధనలు ప్రారంభమైనప్పటినుండి శిశువుల

బాప్తిస్మముగూర్చి వాదోపవాదములు మొదలాయెను. రోమను కాథొలిక్ చర్చి శిశువు బాప్తిస్మమను ఆచారమును ప్రోత్సహించిరి. మరికొందరు, బాల్యములోనే బాప్తిస్మము పొందినట్లయితే పరిశుద్ధాత్మచే పరిశుద్ధపరచబడి రక్షింపబడుదురు అను నమ్మకముతో ఈ ఆచారమును పాటించిరి. ఈ పద్ధతులన్నియు లేఖనములకు వ్యతిరేకముగా ఉన్నవి. డా॥ఎల్. లాన్జ్ అను జర్మనీకి చెందిన శాస్త్రజ్ఞుడు శిశువుల బాప్తిస్మముగూర్చి ఈ విధంగా తెలియజేసెను: "పరిశుద్ధలేఖనములను చదువు ప్రతివాడును, ఆదిమ క్రైస్తవులు క్రొత్తగా జన్మించిన శిశువులకు బాప్తిస్మము ఇచ్చుట అను ఆచారముగూర్చి ఎరిగియుండలేదని గ్రహించునని చెప్పెను". (ప్రొటెస్టాంటిసమ్ చరిత్ర - పు.221). డీన్ స్టాన్లీ అను మరియొకతను తన రచనలలో ఈ విధంగా తెలియజేసెను: "నీళ్లలో పూర్తిగా మునిగి బాప్తిస్మము పొందు పద్ధతి అపొస్తలుల కాలమునుండి వచ్చిన ప్రాచీన పద్ధతి... ఇందునిమిత్తము చాలావుంది ఈ ఆచారమును పాటించుటకు ఇష్టపడలేదు; ఉత్తరమున మరియు పశ్చిమమున ఉన్న వారి అభిప్రాయములకు అనుకూలముగా ఒక గొప్ప మార్పును తీసుకొనివచ్చిరి; అదే శిశువులకు చిలకరించుట ద్వారా బాప్తిస్మమిచ్చుట అను ఆచారమును అమలులోకి తెచ్చిరి... నిర్బంధ పూరితమైన ప్రాచీన ఆచారములకు బదులు ఆధునిక పద్ధతులను ఆచారములుగా మొదలుపెట్టుటకు ఇది ఒక గొప్ప ఉదాహరణ". (19వ శతాబ్దపు పునర్వ్యమర్శనము, అక్టోబరు 1879).

మరియొక విధముగా చెప్పవలెనంటే, యేసుయొక్క అపొస్తలులు మొదలుపెట్టిన లేఖనములలోని ఆచారమును ఆధునిక

చర్చ్ వారు పూర్తిగా మార్చివేసిరి. ఎందుకనగా ఆ ప్రాచీన ఆచారము అనుకూలవముగా లేదా అంగీకారవముగా లేకుండెనని వారు తెలియజేసిరి.

## సందేహములు

ఇంతవరకు మనము చెప్పుకున్న దానిలో కనీసము రెండు సందేహములు రావచ్చును; వీటిని మనము గమనించవలెను: మొదట, కొంత మంది ఇలా అందురు: "అవును, చెప్పినదంతయు నిజమని అంగీకరిస్తున్నాను, కాని బాప్తిస్మము పొందుటకు నాకు కోరిక లేదు; అయితే మతమును కేవలము భావప్రేరితమైనదిగా ఎంచువారిలో ఈ వెఖరిని చూడగలము. వారిలో ఏ భావములును లేనప్పుడు బాప్తిస్మముపొందుటకు మేము సిద్ధముగా లేమని ముగించెదరు.

కాని ఇది తప్పు. దేవుడు మననుండి ఏమి కోరుకొనుచున్నాడనగా, మొదట ఆయన వాక్యమును గ్రహించుటకు మన మనస్సులను సిద్ధపరచుకొనవలెను; ఆయన తెలియజేసిన సత్యములను స్వీకరించి ఆయనను సేవించుటకు నిర్ణయించుకొనవలెను. దేవుని వాక్యమును గ్రహించుటకు ఈ పద్ధతి ఎందుకు ఉత్తమమైనదో ఒక ముఖ్యకారణము కలదు. ఒక వ్యక్తి సత్యమును గ్రహించి, ఆ సత్యమే తన జీవితముపై ప్రభావము చూపుటకు అవకాశమిచ్చినయెడల అప్పుడు, ఆ వ్యక్తి వేరుగా నుండును. అతడు సత్యమును పాటించుటకు కొనసాగించినయెడల అతని స్వభావములోను గొప్ప మార్పు వచ్చును. "మీ మనస్సు మారి నూతనమగుటవలన రూపాంతరము పొందుడి" అని పౌలు

తెలియజేసెను. అప్పుడు ఆ మార్పు నిత్యముండును. దేవుడు మార్పునొందిన ఆ క్రొత్త వ్యక్తిని తన సేవలో ఇప్పుడును మరియు రానున్న యుగములోను ఉపయోగించుకొనును.

## దేవుని ఆజ్ఞ

కాని చివరిగా, బాప్తిస్మముపొందవలెనని దేవుడు ఆజ్ఞాపించెనని మనము తెలుసుకున్నయెడల అప్పుడు దేవుని ఆజ్ఞను తప్పక పాటించవలెను; లేనియెడల దేవుని వాక్యమునే తృణీకరించిన వారమగుదుము. అయితే మనము ఏ నిర్ణయము తీసుకున్నను దానియొక్క ప్రతిఫలమును తరువాత అనుభవించెదము; దేవుని సత్యమును మన జీవితములో అనుభవించిన యెడల దేవుడు కృపాసంపన్నుడని గ్రహించెదము. "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ 1:7). కాని మొదటి ప్రాముఖ్యమైన మెట్టు: దేవుని వాక్యముపట్లను మరియు ఆ వాక్య ప్రకారము నడుచుకొనుటకు మనము దీనమనస్సు గలవారమైయుండవలెను.

అయితే మరికొందరు: "దేవుని వాక్యమంతయు సత్యమని అంగీకరించెదను, కాని దాని అనుసరించి జీవించుటకు నేను నిర్ణయించుకొనలేదు" అని అందురు. ఇదంతయు వాస్తవమే. కాని దేవుని ఆజ్ఞను పాటించక పోవుటకు ఇది కేవలము ఒక కుంటుసాకు లేదా నెపము కావచ్చును. దేవుని వాక్యములో బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించబడియున్నదని ఒక వ్యక్తి గ్రహించినను బాప్తిస్మము పొందుటకు సందేహించిన యెడల అప్పుడు అతడు దేవుని

చిత్తమును తృణీకరించుచున్నాడని స్పష్టముగా తెలియును. మరియొక విషయమేమనగా ఒక వ్యక్తి బాప్తిస్మముపొందక పోవుటకు కారణమేమనగా అతడు క్రీస్తువలెదిరిగా జీవించుటకు తనకు సాధ్యపడదు గనుక ఖండింపబడుదునని నిరాశ చెందును. అయితే ఈ భావము కేవలము అపార్థముచేసుకొనుటద్వారానే కలుగును – ఆ అపార్థమేమనగా – దేవుడు, నిత్యము మనము పరిపూర్ణులుగానుండవలెనని కోరుకొనుచున్నాడనునది. అయితే మానవ బలహీనతలు మరియు స్వభావముగూర్చి దేవుడు ఎరిగియున్నాడు. ఈ విషయమును కీర్తన 103లో కీర్తనల రచయిత ఎంతో స్పష్టముగా వివరించెను.

“భూమికంటె ఆకాశము ఎంత ఉన్నతముగా ఉన్నదో ఆయనయందు భయభక్తులు గలవారియెడల ఆయన కృప అంత అధికముగా ఉన్నది..... తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారియెడల జాలిపడును. మనము నిర్మింపబడిన రీతి ఆయనకు తెలిసేయున్నది మనము మంటివారమని ఆయన జ్ఞాపకముచేసికొనుచున్నాడు” (కీర్తన 103:11-14).

ఒక కఠినాత్ముడైన పరిపాలకునిగూర్చి కాదు గాని, కరుణాకటాక్షములుగల తండ్రిని మనము ఎరిగియున్నాము. అయితే ఆ తండ్రియే, ప్రతి ఒక్కరును నశింపక రక్షణ పొందవలెనని కోరుకొనుచున్నాడు.

“ఆయన (దేవుడు) మనుష్యులందరు రక్షణపొంది సత్యమునుగూర్చిన అనుభవజ్ఞానముగలవారైయుండవలెనని

యిచ్ఛయించుచున్నాడు" (1తిమోతి 2:4).

"ప్రభువు తన వాగ్దానమునుగూర్చి ఆలస్యముచేయువాడు కాడు గాని యెవడును నశింపవలెనని యిచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు" (2పేతురు 3:9).

క్లుప్తంగా చెప్పవలెననినా తమ తప్పులను ఒప్పుకొని, పశ్చాత్తాపమునొంది ఆయనను సేవించుటకు ప్రయత్నించువారిని దేవుడు క్షమించుటకు సిద్ధముగా నున్నాడు. వారిని ప్రోత్సహించుటకు యేసు ప్రభువు మనకును తండ్రికిని మధ్యవర్తిగా దేవుని కుడిపార్శ్వమున నున్నాడు.

దేవుని కృపాకనికరములయందు విశ్వసించి ఆయన ఆజ్ఞలను పాటించుటకు మనము సిద్ధముగా నుండవలెను. ఈ విధంగా చేయుటకు బాప్తిస్మము మొదటి మెట్టు.

## ఆధిక్యము

సత్యమును, అనగా మనయెడల దేవునియొక్క చిత్తమును, గ్రహించినమనుటకు మన బాప్తిస్మము సూచనయైయున్నది. బాప్తిస్మము ద్వారా క్రొత్త లక్ష్యములతో కూడిన జీవిత ద్వారము తెరువబడును; మన జీవితము కూడా క్రొత్తగానుండును. క్రొత్త మార్గములో నడిచెదము; అస్థిరత్వము మరియు సమస్యలతో నిండియున్న ఈ లోకములో జీవించుటకు, ప్రాముఖ్యమైన నిర్ణయములను తీసుకొనుటకు శక్తిని పొందెదము. "దేవుడు, క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనును". మనము

సువార్తను విశ్వసించినప్పుడు మన స్థాయి లేదా అంతస్తు మారును.

మన పాపములద్వారా ఇకమీదట దేవునినుండి వేరుపరచబడలేము. కాని ఆయన దృష్టిలో ప్రశస్తమైన కుమారులు మరియు కుమార్తెలుగా నుందుము. మరియు యేసు ప్రభువు తిరిగి వచ్చి ఈ భూమిపై స్థాపించనున్న రాజ్యమునకు వారసులముగా నుందుము.

ఇది ఒక గొప్ప భాగ్యమైయున్నది. అశ్రద్ధతో ఆ భాగ్యమును మనము త్రోసివేయకూడదు.

“క్రీస్తు యేసులోకి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోకి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి” (రోమా 6:3-4).

బాప్తిస్మమనగా నేమి? అది చిన్న పిల్లలకా లేదా పెద్దవారికా? రక్షింపబడుటకు నేను బాప్తిస్మము పొందవలెనా?

ఈ ముఖ్యాంశముగూర్చి బైబులు ఏమి బోధించుచున్నదో ఈ పుస్తకము తెలియజేయుచున్నది.

దిగువ ఇవ్వబడినపుస్తకములకొరకు మా చిరునామాకు వ్రాయండి:

# ఉచిత బైబులు మాస పత్రిక
# బైబులు కరెస్పాండెన్స్ కోర్సు
# బైబులు సమావేశముల వివరములకొరకు


కేరళ, తమిళనాడు మరియు కర్నాటకలోనున్న వారు:

**క్రిస్టడెల్ఫియన్స్, పి. ఓ. బాక్స్ - 535, ఫ్రేసర్ టౌన్, బెంగుళూరు 560005, ఇండియా**

ఇతర స్థలములోనున్న వారు:

**ప్రింట్‌ల్యాండ్ పబ్లిషర్స్, జి.పి. ఓ. బాక్స్ - 159, హైదరాబాదు, ఆ.ప్ర. - 500001, ఇండియా**